క్లుప్తంగా

మైసమ్మ చెంత భక్తుల రద్దీ



నవాబుపేట: మండలంలోని మైసమ్మ దేవాలయం చెంత ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఏడాది ముగుస్తున్న తరుణంలో చివరి ఆదివారం అమ్మవారి సన్నిధికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు మైసమ్మ దేవతకు బోనాలు, మొక్కులు చెల్లించుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

పోస్టర్ విడదల



నవాబుపేట: మైసమ్మ దేవాలయ ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం జడ్చర్లలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి మొదటివారంలో జరిగే ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని, భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని దేవాలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవాలయాధికారి మదనేశ్వర్‌రెడ్డితో పాటు ఆలయ పాలకవర్గం, సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండల కేంద్రంలోని దుందుభీ వాగు నుంచి ఆదివారం ఉదయం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మిడ్జిల్‌కు చెందిన సురేందర్‌గౌడ్‌కు చెందిన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని కేసునమోదు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కావలి కృష్ణ

జడ్చర్ల టౌన్: మాదిగ ఉద్యోగులు సంఘం(ఎంఈఎఫ్) నియోజకవర్గ అధ్యక్షుడిగా కావలి కృష్ణ ఎన్నికయ్యారు. పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎంఈఎఫ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మోహన్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా జీవన్, ఉపాధ్యక్షులుగా నాగయ్య, యాదయ్య, సంయుక్త కార్యదర్శిగా ఉత్తరయ్య, మన్నెం, కోశాధికారిగా యాదయ్య, న్యాయ సలహాదారు లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు కుర్మంతి, నర్సింహులు, రాములు, నర్సింహులు, నారాయణ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శ్రీనివాసరావు వ్యవహరించారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా జాకీర్ కొనసాగింపు



జడ్చర్ల టౌన్: ఎంఐఎం జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎండీ జాకీర్‌ను కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం జడ్చర్లలో నిర్వహించిన ఎంఐఎం పార్టీ సమావేశంలో ఎన్నికల అధికారిగా సమాధబిన్ అబ్ద్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాకీర్, ప్రధాన కార్యదర్శిగా యాసర్‌ను నియమించారు. ఇతర కార్యవర్గంతో పాటు మండల, పట్టణ కార్యవర్గాన్ని సైతం ఎన్నుకున్నారు. వారి పేర్లను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి ప్రకటిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్ జాబర్బిన్ సాయిద్‌లతోపాటు నాయకులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ అదృశ్యం

మిడ్జిల్: మండలంలోని దోనూర్‌కి చెందిన ఓ తల్లీబిడ్డ అదృశ్యమైనట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. వివరాలు.. దోనూర్‌కు చెందిన నెలికంటి పద్మ (28), తన మూడేళ్ల కుమార్తెని తీసుకొని శనివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భర్త నెలికంటి రవి బంధువులు, స్నేహితులు తెలిసినచోట వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మరో యువతి..

మిడ్జిల్: మండలంలోని మసి గొండ్లపల్లికి చెందిన ఓ యు వతి అదృశ్యమైనట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. వివరాలు.. మసి గొండ్లపల్లికి చెందిన దొబ్బ పూజ అనే యువతి శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు అంతా వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఆయువతి తండ్రి ఈశ్వర్యయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదకర మలుపులు



నవాబుపేట-యన్మన్‌గండ్ల రోడ్డులో మలుపు



చిక్కుడు వాగు సమీపంలో మలుపు చెంత కనిపించని సూచిక బోర్డులు

- కనపడని హెచ్చరిక బోర్డులు
- తరుచూ ప్రమాదాలు
- ఇబ్బందులో ప్రయాణికులు

నవాబుపేట: నవాబుపేట– మహబూబ్‌నగర్ రోడ్డు మలుపు అధికంగా ఉంటాయి. అలాంటి రోడ్డు అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ ప్రాంతంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో సింగిల్ రోడ్డు ఉండేది. తాజాగా డబుల్ రోడ్డుగా మార్చినా ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్లటంతో ములుపుల వద్ద వాహనాలు బోల్తా పడుతున్నాయి. నవాబుపేట మండల కేంద్రం నుంచి మొదలు యన్మన్‌గండ్ల, గద్దగుండు, రుద్రారం, కాకర్లపహాడ్, చిక్కుడువాడు వద్ద ఉన్న మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి ఆయా మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మైసమ్మ అడవి ప్రాంతంలో ప్రమాదకరమైన మలుపు

కల్వర్టు చెంతకు రాగానే..

గ్రామ సమీపంలో డబుల్ రోడ్డు కదా అని వేగంగా వస్తే కల్వర్టు చెంతకు రాగానే గోతిలో పడే ప్రమాదముంది. గతేడాది రుద్రారం గ్రామానికి చుట్టపుచూపుగా వస్తున్న వ్యక్తి కల్వర్టులో పడి మృతిచెందాడు. ఇలా తరుచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఎలాంటి సూచికలు లేవు



నవాబుపేట నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే రోడ్డు మలుపులు అధికంగా ఉన్నాయి. కానీ అక్కడ ఎలాంటి ప్రమాద సూచికలు లేవు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈదారిలో ప్రయాణించే కొత్తవారు మాత్రం జాగ్రత్తగా వెళ్లాలి. కల్వర్టుకు రక్షణ గోడలు సైతం లేవు.

– వెంకటేశ్ (పోమాల్)

దళితులను నిండా ముంచిన కేసీఆర్

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: దళితులకు మూడెకరాల భూమిని ఇస్తానని నమ్మబలికి మాజీ సీఎం కేసీఆర్ వారిని నిండా ముంచారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం స్థానిక టీఎన్జీఓ భవన్‌లో మాలల చైతన్య సమితి 9వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళిత, బహుజన బిడ్డలకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఎందరో త్యాగాలు చేశారని, ఆనాడు తొలి ముఖ్యమంత్రిగా ఒక దళితుడుని చేస్తానని కేసీఆర్ వంచించారని ఆరోపించారు. కుటుంబపాలన రాజరిక పాలనతో సమానమైనదని నాడే అంబేడ్కర్ చెప్పారని, అదే రాజరిక పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లు కేవలం నలుగురి చేతుల్లోనే ఉంచుకున్నారని విమర్శించారు. దళిత, బహుజన బిడ్డలకు కనీసం మంత్రి పదవి ఇవ్వకుండా అపహాస్యం చేశారన్నారు. ఇప్పుడు ప్రజాప్రభుత్వంలో ఏ నిర్బంధాలు లేవని, నేరుగా ప్రజలు ఎమ్మెల్యేలను, మంత్రులను, ముఖ్యమంత్రిని సైతం కలిసి వారి సమస్యలను చెప్పుకునే అవకాశం కల్పించిందన్నారు. భారతదేశ చరిత్ర గతిని మార్చిన అంబేడ్కర్ వల్లనే ఇప్పటికి దేశం విచ్ఛినం కాలేదని, అన్ని మతాలు, అన్నికులాలు, అన్నివర్గాల ప్రజలు ఈదేశం నాది అనే ఉద్దేశాన్ని, భావాన్ని అంబేడ్కర్ ప్రజల్లో నింపారని చెప్పారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మాలల చైతన్య సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మూలె కేశవులు, నాయకులు రాందాస్, గోవింద్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి సరికాదు



మహబూబ్‌నగర్ న్యూటౌన్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో ప్రధానోపాధ్యాయుడు(హెచ్ఎం)పై మతోన్మాద శక్తులు దాడి చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. ఈదాడిని ఖండిస్తూ అశోక్‌టాకీస్ చౌరస్తాలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఈ అమానుష చర్యను ప్రజాతంత్ర వాదులు, ఆధ్యాత్మికవాదులు, ప్రజాసంఘాలు ఖండించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్, ఆవాజ్ జిల్లా కన్వీనర్ సయ్యద్‌గౌస్, సయ్యద్ జాహంగీర్, ఖాదర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అబ్దుల్ ఖాదర్‌షా గంధోత్సవం



దర్గాలో ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ మల్లురవి, ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోగల హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌షా సాహెబ్ రహెమతుల్లా అలై దర్గా 86వ ఉర్సు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన గంధోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. షేక్ బడేసాబ్ ఇంటి నుంచి ఒంటెపై బయలుదేరిన గంధం ఊరేగింపుగా అశోక్‌టాకీస్ చౌరస్తా, క్లాక్ టవర్, డీఎంఅండ్‌హెచ్ఓ ఆఫీస్, వన్‌టౌన్ చౌరస్తా, తూర్పుకమాన్ వీధుల మీదుగా దర్గాకు తీసుకెళ్లారు.దారి పొడవునా భక్తులు గంధాన్ని సందర్శించి ఫాతెహాలు సమర్పించారు. అనంతరం దర్గాపై పూలు, చాదర్‌కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు ఉత్సవాల్లో దర్గా ముతవల్లీ మహ్మద్ అబ్దుల్ జమీర్‌ఖాద్రి, మతపెద్దలు పాల్గొన్నారు. ఉత్సవాల్లో హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దర్గాలో ఎంపీ ప్రత్యేక ప్రార్థనలు

అబ్దుల్‌ఖాదర్‌షా దర్గాలో ఆదివారం రాత్రి నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్దన్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ షబ్బీర్ అహ్మద్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, నాయకులు అజ్మత్‌అలీ, అక్బర్ పాల్గొన్నారు.

నేడు దీపారాధన

సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌షా దర్గా ఉత్సవాల్లో భాగంగా సోమవారం దీపారాధన (చిరాగా) వేడుకలు నిర్వహించనున్నారు. 31న జ్యారత్ ఫాతేహాతో దర్గా ఉత్సవాలు ముగుస్తాయి.

వైద్యశిబిరం విజయవంతం



మిడ్జిల్: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులు సరఫరా చేశారు. ఈశిబిరంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రబ్యానీ, నాయకులు సంపత్, గౌస్, ఆదాం, అమరేందర్‌రెడ్డి, డాక్టర్స్ క్రాంతి, నాగరాజు, వాణి, ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



దేవరకద్ర: మండల కేంద్రంలో ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సర్వర్ కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. దేవరకద్ర టౌన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పి. జగన్మోహన్ రెడ్డి సోదరుడు హన్మంతరెడ్డి ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. గద్దెగూడెంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గొల్ల తిరుపతయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అదేగ్రామంలో మృతిచెందిన వెంకటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పవర్‌బోర్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని బస్తీలో తాగునీటి ఎద్దడి నివారణకు ఇటీవల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొత్త పవర్ బోరు వేయించారు. ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ దీనిని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కౌన్సిలర్ తాటి గణేష్‌కుమార్, స్థానికుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫ్రంట్ జిల్లా మహాసభలు

పాలమూరు: తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా మహాసభలు సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో నిర్వహిస్తున్నట్లు టీపీఎఫ్ జిల్లా కన్వీనర్ మణ్యంకొండ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఆవిర్భవించిన రాష్ట్ర ఉద్యమంలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ రాష్ట్రసాధనలో టీపీఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. జిల్లా మహాసభలకు ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది



చిన్నచింతకుంట: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అమ్మాపురంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సుతారి భాస్కర్ దశదిన కర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. భాస్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వడ్డే నారాయణను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

అదుపుతప్పి ఒరిగిన ట్రాక్టర్ ట్రాలీ



నవాబుపేట: సిమెంట్ స్తంభాలను తీసుకెళ్తున్న ఓట్రాక్టర్ ట్రాలీ అదుపుతప్పి పక్కకు ఒరిగిన ఘటన ఆదివారం మండలంలోని మద్రిప్రాంతంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని మహబూబ్‌నగర్ రోడ్డులోని పలుగు మద్రిప్రాంతంలో పొలానికి కంచె వేసేందుకు సిమెంట్ స్తంభాలను ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. ఓవర్‌లోడ్ కావడంతో ట్రాలీ అదుపుతప్పి ఒరగడంతో స్తంభాలు ట్రాక్టర్ ఇంజన్‌పై పడ్డాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ తృటిలో తప్పించుకున్నాడు.

సబ్సిడీలు ఇవ్వాలని వినతి



రాములునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రైతులకు అవుట్‌పుట్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్‌కు వినతిపత్రం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, దీనికి సంబంధించి 100 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు సరఫరా చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు శంకర్ నాయక్, నాయకులు బెక్కరి మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్‌హక్, తాహెర్ ఉన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన కాంతిమల శిఖరం



అయ్యప్పకొండపై మహా పడిపూజ చేస్తున్న అయ్యప్ప మాలధారులు

మహమ్మదాబాద్: అయ్యప్ప మహాపడి, నారికేళ పూజ సందర్భంగా అయ్యప్ప నామస్మరణతో కాంతిమల శిఖరం మార్మోగింది. ఆదివారం గురుస్వాములు శ్రీనివాస్, రాజు, గోపాల్, బాల్‌రాజ్, నాగరాజు ఆధ్వర్యంలో అయ్యప్పకొండ కాంతిమల శిఖరంపై అయ్యప్ప మహా పడిపూజ, నారికేళ పూజను జరిపించారు. ఉదయం నుంచే అయ్యప్ప కలశాలతో ఊరేగింపు నిర్వహించి 10.30 గంటలకు అయ్యప్ప పడిమెట్ల కలశ పూజాభిషేకం అనంతరం పడిని వెలిగించారు. చెన్నయ్య నారికేళ గురుస్వామి 18వ సంవత్సరం సందర్భంగా ఆయనకు చక్రస్నానం చేయించారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడింది: పరిగి ఎమ్మెల్యే

మహమ్మదాబాద్‌లోని అయ్యప్పకొండపై జరిగిన అయ్యప్ప మహాపడిపూజ సందర్భంగా వచ్చిన భక్తులు ఆటపాటలతో అయ్యప్ప నామస్మరణతో ఆధ్యాత్మిక ఉట్టిపడిందని పరిగి ఎమ్మెల్యే డా.టీ.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అయ్యప్ప మహా పడిపూజకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో కొండ ప్రాంతమంతా కిటకిటలాడింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, గండేడ్ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతి, రాంరెడ్డి, అనంతయ్యగుప్త, ఆలయకమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

ముగిసిన అల్పాహార కార్యక్రమం

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌టాకీస్ చౌరస్తా సమీపంలోని అన్నదాన మండపంలో నవంబర్ 6న ప్రారంభమైన అల్పాహార కార్యక్రమం ఆదివారం ముగిసిందని సమితి జిల్లా అధ్యక్షులు సీమ నరేందర్ తెలిపారు. 54 రోజులపాటు దాదాపు 11 వేల మంది అయ్యప్ప మాలధారులు అల్పాహారం స్వీకరించినట్లు తెలిపారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పడిపూజ నిర్వహించారు. రఘుపతిశర్మ గురుస్వామి, రామేశ్వర్, సతీష్ పాల్గొన్నారు.

ఎరుకల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న ఎరుకల సంఘం అధ్యక్షుడు లాల్‌కోట శ్రీనివాసులు

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో సంఘం నాయకులు సమావేశమై జిల్లా అధ్యక్షుడిగా లాల్‌కోట శ్రీనివాసులును, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, బాలరాజు, అంజయ్య, విద్యార్థి విభాగం నుంచి మహేష్, శేఖర్, వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఎల్లయ్య, లక్ష్మి, జయమ్మ, భీమయ్య, యాదయ్యను ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న ఎరుకల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలోనే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో చర్చిస్తామని జిల్లా అధ్యక్షుడు లాల్‌కోట శ్రీనివాసులు తెలిపారు.

పండ్లతోటల సాగుపై మొగ్గు



రాజాపూర్ మండలంలో సాగు చేసిన జామ తోట

అంతర్ పంటలతో లాభాలు

రాజాపూర్: పండ్లతోటల సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. వరి, మొక్కజొన్న, పత్తి, మిరప తదితర పంటలకు పెట్టుబడి ఎక్కువ దిగుబడి తక్కువగా వస్తుంది. అలాగే రైతులకు కూలీల కొరత కూడా ఓ సమస్యగా మారింది. దీంతో ఆధునిక వ్యవసాయంతో పాటు పండ్లతోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రాజాపూర్ మండలంతో పాటు బాలానగర్ మండలాల్లోని రైతులు ఎక్కువగా మామిడి,, జామ, డ్రాగన్, నేరడు, బత్తాయి, సపోట, బొప్పాయి తోటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రాజాపూర్, బాలానగర్ మండలాల్లోని ఖానాపూర్, తిర్మలాపూర్, ఉడిత్యాల, నేర్లపల్లి, చెన్నవెల్లి, దోండ్లపల్లి పెద్దరేవల్లి తదితర గ్రామాల్లో ఎక్కువగా మామిడి, జామ తోటలతో పాటు ఆయిల్‌ఫాం తోటలను పెంచుతున్నారు. పండ్ల తోటల్లో కాయలు చేతికొచ్చేందుకు నాలుగైదు సంవత్సరాలు పడుతుంది. దీంతో కొందరు రైతులు మొక్కలు చిన్నగా ఉన్న సమయంలోనే అంతర్ పంటగా వేరుశనగతో పాటు పెసర, ఆవాలు, కూరగాయల సాగును చేస్తున్నారు. దీంతో రైతులకు లాభాలు చేకూరే అవకాశముంది. మామిడి పూత వచ్చే సమయంలోనే తెలంగాణతో పాటు ఏపీ నుంచి వ్యాపారులు వచ్చి తోటలోఉన్న చెట్ల సంఖ్యను బట్టి ముందుగానే రైతులతో కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో పండ్లతోటల రైతులకు మార్కెటింగ్ సమస్య కూడా ఉండదు.

జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా పండ్లతోటల సాగు వివరాలు

పండ్లతోటలు	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
మామిడి	6671
ఆయిల్‌ఫామ్	1660
జామ	436
దానిమ్మ	180
సపోట	101
సీతాఫలం	89
బత్తాయి	31
కూరగాయలు	650
మొత్తం సాగు	9818 ఎకరాలు

సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించాలి



పండ్లతోటల రైతులకు గతంలో మాదిరిగా ఫాంఫండ్‌లు, స్ప్రింకర్లు, డ్రిప్ ఇరిగేషన్‌తో పాటు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, ట్రాక్టర్‌లు తదితర వాటిపై సబ్సిడీ ఇచ్చి రైతులను ప్రోత్సాహించాలి. పండ్ల మొక్కల విషయంలో ప్రభుత్వ నర్సరీల్లో, యూనివర్సిటీల ద్వారా నాణ్యమైన మొక్కలను సరఫరా చేసి ఎప్పటికప్పుడు హార్టికల్చర్ శాఖ అధికారులచే పర్యవేక్షణ ఉండేలా చూడాలి

– శ్రీధర్‌గౌడ్ మామిడి రైతు

మామిడి మొక్కలను నాటా



నాకున్న ఐదున్నర ఎకరాల్లో గతంలో జామ మొక్కలను నాటాను. అనుకున్న స్థాయిలో దిగుబడి రాకపోవడంతో గతేడాది జామ తీసేసి మామిడి మొక్కలను నాటా. సంగారెడ్డి హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి మొక్కలను తీసుకువచ్చాను. రైతులకు అవసరమయ్యే యంత్రాలను సబ్సిడీతో ఇచ్చి మార్కెటింగ్ చేసుకునేలా సహకరించాలి.

– కప్పెరి బచ్చిరెడ్డి, రైతు, రాజాపూర్.

డ్రిప్ సబ్సిడీపై తీసుకోవచ్చు



ప్రస్తుతం అన్ని రకాల పండ్లతోటలు సాగు చేసుకునే రైతులకు ప్రస్తుతం డ్రిప్ సబ్సిడీపై అందుబాటులో ఉంది. ఒక్క కుటుంబానికి గరిష్టంగా 12.50ఎకరాల వరకు సబ్సిడీపై డ్రిప్ పొందవచ్చు. మూడేళ్ల వరకు మామిడి, జామ, సీతాఫలం, డ్రాగన్ మొక్కల మెయిన్‌టెనెన్స్‌కు హార్టికల్చర్ శాఖ సహకారం అందిస్తోంది.

– మహేందర్, హార్టికల్చర్ అధికారి